నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ శనివారం 14 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

టార్పాలిన్ కవర్లు కప్పుతూ పంటను కాపాడుకుంటున్న రైతులు

బోథ్ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

బోథ్, డిసెంబర్ 13 : బోథ్ మండలంలోని బాబెర తండా, కంటేగాం గ్రామాలకు హైమాస్ట్ లైట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా శుక్రవారం రాత్రి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయా గ్రామాల్లో ఆరు చోట్ల ఎమ్మెల్యే నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. తమ గ్రామాల్లో వెలుగు నింపినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ అన్న యువసైన్యం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబెర తండాలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

సోయా కొనుగోళ్లకు అనుమతి వచ్చేనా ?

ప్రభుత్వానికి లేఖ రాసిన అధికారులు

- మార్కెట్‌యార్డులు, రైతుల ఇండ్లల్లో పంట నిల్వలు
- మరో లక్ష క్వింటాళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశం

ఆదిలాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ పంట కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. నాఫెడ్ కోటా పూర్తయినందున జిల్లాలోని వివిధ మార్కెట్‌యార్డుల్లో వారం రోజుల నుంచి పంట కొనుగోళ్లు జరగడం లేదు. ఈ ఏడాది వానకాలంలో జిల్లాలో 71,226 ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు చేశారు. ఆదిలాబాద్ రూరల్, మావల, జైనథ్, బేల, తాంసి, తలమడుగు మండలాల్లో ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున పంట దిగుబడి వచ్చింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో అక్టోబర్ మొదటి వారంలో సోయాబీన్ కొనుగోళ్లను ప్రారంభించారు. ఆయా మండలాల ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, బేల, తాంసి, నార్నూర్, జైనథ్, నేరడిగొండ మార్కెట్ యార్డుల్లో పంటను సేకరించారు. ఈ నెల 5 వరకు జిల్లాలో 2.47 లక్షల క్వింటాళ్ల పంటను కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

పంట విక్రయించేందుకు పడిగాపులు

జిల్లాలో వారం రోజులుగా సోయాబీన్ కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు పంట విక్రయించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ కోటా ముగిసినందునా పంట కొనుగోళ్ల నిలిచిపోయాయి. అధికారులు అదనంగా పంట కొనుగోళ్ల కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్‌కు లేఖలు రాసినా ఇంతవరకు అనుమతి లభించలేదు. జైనథ్, బేల, ఆదిలాబాద్ రూరల్, తలమడుగు, తాంసి మండలాల్లో రైతుల వద్ద పంట నిల్వలు ఉన్నాయి. బేల మార్కెట్‌యార్డులో రైతులు నాలుగు రోజుల కిందట పంటను తీసుకు వచ్చి విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారు. పలు గ్రామాల్లో రైతుల ఇండ్లలోనే సోయా నిల్వలు పేరుకుపోయాయి. జిల్లాలో చలి కారణంగా పంటలో తేమ శాతం పెరిగే అవకాశం ఉండడం, చల్లటి వాతావరణం కారణంగా సోయాబీన్ నల్లగా మారి పాడవుతుందని రైతులు అంటున్నారు. మార్కెట్‌యార్డుల్లో ఉంచిన పంటకు రక్షణగా రైతులు రాత్రి, పగలు అక్కడే కాపలా ఉంటున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో ముంచుతో పంట పాడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసి పంట నష్టపోకుండా సోయా కొనుగోళ్లను ప్రారంభించాలని కోరుతున్నారు.

❖ 4 రోజుల నుంచి కాపలా ఉంటున్నాను..

నేను 5 ఎకరాల్లో సోయాబిన్ పంటను సాగు చేయగా 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటను విక్రయించేందుకు బేల మార్కెట్‌యార్డుకు నాలుగు రోజుల కిందట తీసుకువచ్చాను. బార్‌కోడ్, గన్ని సంచులు లేకపోవడంతో కొనుగోళ్లు జరపడం లేదని మార్కెటింగ్ సిబ్బంది అంటున్నారు. పంట నష్టపోకుండా రాత్రి, పగలు కాపలా ఉంటున్నాం. చలికి గజ గజ వణుకుతూ కాపలా కాస్తున్నాం. ఎప్పుడు కొంటరో అధికారులు చెప్పడం లేదు. ఎవరిని అడుగాలో తెలియడం లేదు. పంట నష్టపోకముందే అధికారులు కొనాలి.

- దీపక్, రైతు, దోప్తాల, బేల మండలం



ఖానాపూర్ మండలం తర్లపాడులో ఏపుగా పెరిగిన వరినారు

యాసంగికైనా రైతు భరోసా అందేనా?

జిల్లాలో 10 రోజుల్లో ప్రారంభం కానున్న వరినాట్లు

- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురు చూపులు
- వానకాలం సీజన్ పైసలు ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు
- ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయిన అన్నదాతలు
- బీఆర్ఎస్ హయాంలో జిల్లాలోని రైతుల ఖాతాల్లో రూ.2163 కోట్లు జమ

నిర్మల్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ సీజన్‌లో రంచన్‌గా అందే రైతుబంధు పథకం నిధులతో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలను సాగు చేసుకునే వారు. ప్రతి వానకాలం, యాసంగి సీజన్లకు గాను ఎకరానికి రూ.10వేల చొప్పున కేసీఆర్ ప్రభుత్వం నిర్ధేశిత గడువులోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. రైతు బంధు నిధులు అందక..అటు బ్యాంకులు సహకరించక..ఇటు ప్రభుత్వం కనికరించకపోవడంతో అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తెచ్చి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మూలంగా పెట్టుబడికి ఇబ్బంది పడుతున్న రైతులంతా మాజీ సీఎం కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ హయాంలో సకాలంలో పెట్టుబడి సాయం అందించి దేవుడిలా ఆదుకున్నాడని గుర్తు చేసుకుంటున్నారు. వానకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ యాసంగి సీజన్‌కైనా రైతు భరోసా సాయాన్ని అందిస్తుందో లేదో నన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగుకోసం అన్నదాతలు తమ భూములను సిద్ధం చేశారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఆరుతడి పంటలైన మక్క, జొన్న, శనగ తదితర పంటలను వేశారు. వరి పంటను సాగు చేసే రైతులు నారుమళ్లను సిద్ధం చేసి దుక్కులు దున్ని పెట్టారు. వచ్చే వారం పది రోజుల్లో బోరుబావుల కింద వరినాట్లు సైతం మొదలు కానున్నాయి. యాసంగి పంటల ప్రణాళికను సైతం వ్యవసాయాధికారులు ఇప్పటికే విడుదల చేశారు. అధికారుల అంచనా ప్రకారం ఈ యాసంగిలో 3 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయనున్నారు. ఇందులో 1,10,000 ఎకరాల్లో వరి, 1,02,000 ఎకరాల్లో మక్క, 35వేల ఎకరాల్లో జొన్న, 55 వేల ఎకరాల్లో శనగ తదితర పంటలు సాగవుతాయని అంచనా వేశారు. అన్ని రకాల పంటలకు విత్తనాలతో పాటు యూరియా 37వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 8 వేల మెట్రిక్ టన్నులు, 20-20, ఇతర ఎరువులు 14వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కానీ పెట్టుబడి సాయం అందక సాగు పనుల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో రంచన్‌గా...

రాష్ట్రంలోని రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసేందుకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఏటా రెండు సార్లు ఎకరాకు రూ.5వేల చొప్పున పంట పెట్టుబడి సాయం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో రంచన్‌గా జమ చేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి 2023 వానకాలం సీజన్ వరకు 11 విడుతల్లో జిల్లా రైతులకు మొత్తం రూ.2,163 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు బంధు స్థానంలో రైతు భరోసాను అమలు చేసి ప్రతి రైతుకూ ఏటా ఎకరాకు రూ.15వేల సాయం చేస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతుకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేస్తామని వాగ్దానం చేసింది. అది కూడా 2023 డిసెంబర్ 9న ఇస్తామని ప్రకటించింది. ఇది జరిగి ఏడాదైనా నేటికీ రైతు భరోసా అమలు కాలేదు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధును కూడా ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 1,88,317 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.228 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఈ పరిస్థితుల్లో రైతులు కేసీఆర్ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ఈ యాసంగిలోనైనా సాయం అందేనా...?

ఈ యాసంగికి రైతు భరోసా డబ్బులను ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రైతుల్లో నమ్మకం కలగడం లేదు. ఇప్పటికే రెండు సీజన్లలో ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుపై రైతులు మండిపడుతున్నారు. గత వానకాలం సీజన్‌లో అనేక సాకులు చెప్పి పంట పెట్టుబడికి నిధులు విడుదల చేయలేదు. రైతు భరోసా అమలు కోసం కొత్త నిబంధనలు రూపొందించాలని, అర్హులకే ఇవ్వాలని, అవకతవకలు అంటూ పట్టి మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా మంత్రి వర్గ ఉప సంఘం కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నది. కనీసం ఈ సీజన్‌లో నైనా వస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒక వేళ ఇచ్చినా ఎంత మందికి ఇస్తారు..? ఎంత మందికి కోత పెడుతారో అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది. మరోవైపు చేతిలో పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు ఈ యాసంగికి రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నిర్మల్ జిల్లాలో 2023 వానకాలం సీజన్ వరకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన రైతుబంధు వివరాలు

సంవత్సరం	సీజన్	రైతులు	రూపాయలు
2018	వానకాలం	1,38,704	155.39 కోట్లు
2018	యాసంగి	1,36,786	157.04 కోట్లు
2019	వానకాలం	1,43,433	188.25 కోట్లు
2019	యాసంగి	1,16,453	133.98 కోట్లు
2020	వానకాలం	1,58,103	215.14 కోట్లు
2020	యాసంగి	1,61,438	217.37 కోట్లు
2021	వానకాలం	1,64,755	217.24 కోట్లు
2021	యాసంగి	1,69,541	219.11 కోట్లు
2022	వానకాలం	1,74,767	220.73 కోట్లు
2022	యాసంగి	1,86,418	227.64 కోట్లు
2023	వానకాలం	1,89,317	228.24 కోట్లు



బీఆర్ఎస్ నాయకులను పార్టీ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

- వినతి పత్రం ఇచ్చే అవకాశం విపక్షాలకు లేదా..?
- గురుకుల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- బీఆర్ఎస్వీ నాయకుల డిమాండ్

మంత్రి సీతక్క పర్యటనలో బీఆర్ఎస్వీ నాయకుల నిర్బంధం

ఖానాపూర్, డిసెంబర్ 13: ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన శైలజ కుటుంబానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తూ న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఖానాపూర్‌కు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గురుకులాల్లో ఉన్న సమస్యలపై అడగకుండా ముందస్తూ నిర్బంధం చేయడం ఎందుకని ప్రశ్నించారు. మంత్రి సీతక్క జిల్లాలో పర్యటిస్తూ కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ప్రారంభించి పోతున్నారే తప్ప, అభివృద్ధి పనులు జరగడం లేదని, సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ప్రజా పాలన అంటూనే చీటికి మాటికి అరెస్ట్‌లు, నిర్బంధాలతో ప్రశ్నించే వారి గొంతునొక్కుతున్నదని విమర్శించారు. ప్రజాపాలన అంటే నిత్యం ప్రజల గొంతు నొక్కే కుట్రలు చేయడమేనా అంటూ ప్రశ్నించారు. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను, బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఇందులో బీఆర్ఎస్వీ నాయకులు శనిగారపు శ్రావణ్, తోట సుమీత్, సుద్దాల మహిపాల్, చుక్కల నరేశ్, మునుగురి ప్రణీత్, బీఆర్ఎస్వీ మండల నాయకులు ఉన్నారు.

చాయ్ చేసి..సీఎం విగ్రహానికి తాగించి

- నిర్మల్‌లో ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల వినూత్న నిరసన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 13 : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అభియాన్ ఉద్యోగులకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో సంఘీభావం తెలిపేందుకు వచ్చిన రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగేంతలోపే మిమ్మల్ని రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని అమలు చేయాలని గుర్తు చేస్తూ శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు రోడ్డుపై చాయ్ చేసి అక్కడే ఏర్పాటు చేసిన రేవంత్‌రెడ్డి విగ్రహానికి చాయ్ తాగించి తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రతినిధి పడాల రవీందర్ వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చాయ్ తాగేంతలోపే రెగ్యులర్ చేస్తామని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని నిరసన తెలిపినట్లు చెప్పారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు, మూడు రోజుల్లో విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని లేదం టే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులకు ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ ఇర్ఫాన్, జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్, లక్ష్మణ్, చొక్కారావు, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర బాబు, రమణా రావు, యాటకారి సాయన్న సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, ఆనంద్, హరీశ్, స్పందన్‌స్పందన్, విజయ్, నవిత, వీణా, అపర్ణ, గంగామణి, ప్రభ, జ్యోతి, శ్రీతల దేవి, సాయినాథ్, వివేక్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్టౌవ్ వెలిగించి చాయ్ చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

టీజీబీ బ్యాంకులో చోరీకి యత్నం

- బ్యాంక్ భవనానికి కన్నం వేసి లోనికి వెళ్లేందుకు యత్నించిన దుండగుడు

ఎదులాపురం, డిసెంబర్13 : ఆదిలాబాద్ మండలంలోని రామాయి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు ఓ దుండగుడు కన్నం వేసి చోరీకి యత్నించాడని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో గురువారం రాత్రి ఓ దుండగుడు టీజీబీ బ్యాంకు భవనానికి రంధ్రం చేసి కర్ర సహాయంతో లాకర్‌ను తెరిచే క్రమంలో పెద్దగా సైరన్ మోగింది. దీంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయాడు. బ్యాంక్ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన రూరల్, ఆదిలాబాద్ వన్, టూటౌన్, జైనథ్ సీఐలు అక్కడికి చేరుకున్నారు. బ్యాంకు చుట్టుపక్కల పంట చేలు ఉండడంతో రంధ్రం చేసేటప్పుడు ఎవరూ గమనించలేక పోయారన్నారు. సీసీ పూటేజ్‌ను పరిశీలించగా గురువారం రాత్రి 1.30 గంటలకు బ్యాంకుకు రంధ్రం చేసి ప్రవేశించేందుకు యత్నించినట్లు రికార్డయింది. దుండగుడు చెప్పులు అక్కడే విడిచి వెళ్లాడు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ముజాహిద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు.

కర్ర సాయంతో లాకర్ తెరిచేందుకు ప్రయత్నిస్తున్న దొంగ

20 లక్షల నగదు, 15తులాల బంగారం సేఫ్

బ్యాంక్‌లో రూ.20లక్షలు, 15 తులాల బంగారు ఆభరణలు భద్రంగా ఉన్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. బ్యాంక్‌లో సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని రూరల్ ఎస్ఐ ముజాహిద్ బ్యాంక్ అధికారులకు కొన్ని నెలల క్రితమే సూచించినట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

బోథ్, డిసెంబర్ 13 : ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని అధికారులు, సిబ్బందిని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం బోథ్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పాఠ్యాంశాలపై విద్యార్థినులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం సరఫరా చేస్తున్న వస్తువులను పరిశీలించి, డార్మిటరీని సందర్శించారు. భోజనం రుచి చూశారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనాన్ని విద్యార్థినులకు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్ కుమార్ ఉన్నారు. అనంతరం బోథ్‌లోని సబ్ రిజిష్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. శనివారం మంత్రి సీతక్క భవనాన్ని ప్రారంభించనుండడంతో పలు సూచనలు చేశారు.

భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ రాజర్షి షా